మట్కాతో అక్రమ దందా

- పొన్నూరులో విచ్చలవిడిగా జూదం
- చర్యలు తీసుకోని అధికారులు

పొన్నూరు: పట్టణంలో మట్కా జూదం విచ్చలవిడిగా సాగుతోంది. అక్రమ సంపాదన కోసం ప్రధాన సెంటర్లనే అడ్డాలుగా మలుచుకొని కొందరు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ జూదం ఉచ్చులో పడి పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కూలి పనులు చేసుకుని సంపాదించిన సొమ్మును సైతం జూదానికి ధారపోస్తున్నారు. ఫలితంగా కార్మికులు, కూలీలు సైతం ఈ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. గత కొద్దికాలంగా పొన్నూరు పట్టణంలో మట్కా జూదం విచ్చలవిడిగా సాగుతోంది. కార్మికులనే లక్ష్యంగా చేసుకుని కొందరు నిర్వాహకులు మట్కా నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పూర్తి స్థాయిలో విఫలం..

మట్కాను కట్టడి చేసేందుకు ఇటీవల పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నా అవి పూర్తి స్థాయిలో మట్కా జూదానికి అడ్డుకట్టపడలేదు. అక్రమ దందాకు అలవాటు పడిన నిర్వాహకులు భయాన్ని వీడి యథేచ్ఛగా మట్కా దందాను మళ్లీ కొనసాగిస్తున్నారని సమాచారం. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో విచ్చలవిడిగా జూదం నిర్వహిస్తున్నా నిఘా వ్యవస్థ కూడా నామమాత్రంగా పని చేస్తోందని ఆరోపణలున్నాయి.



నెంబర్లతో మొబైల్‌లో నిర్వహిస్తున్న మట్కా

మొబైల్ యాప్ ద్వారా..

ప్రధానంగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్, షరాఫ్ బజార్, కూరగాయల మార్కెట్, డఫ్ పేట, ముబారక్ నగర్, కసుకర్రు రోడ్డు తదితర ప్రాంతాల్లో మట్కా విచ్చలవిడిగా సాగుతోంది. కొంత మంది మొబైల్ ఫోన్లలో మట్కా యాప్ ద్వారా మట్కా జూదాన్ని నిర్వహిస్తూ పేదల జేబులు గుల్ల చేస్తున్నారు. జూదానికి అలవాటు పడిన కార్మికులు కొద్దిపాటిగా సంపాదించిన సొమ్మును పోగొట్టుకోవడమే కాకుండా అప్పుల పాలవుతున్నారు. ప్రధానంగా మార్కెట్ సెంటర్లు, పలు టీ స్టాళ్లు, పండ్ల దుకాణాలలో కూర్చొని ఆన్‌లైన్ మట్కా జూదానికి బానిసలవుతున్నారు. కొందరు నిర్వాహకులు ఇళ్లలోనే మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. చేతి రాతలతోనే రాసి రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు తెలిసింది. గుమస్తాలను కూడా ఏర్పాటు చేసుకుని వారికి రూ.వేలల్లో జీతం చెల్లిస్తూ నిర్వాహకులు మట్కా నిర్వహిస్తుండటం గమనార్హం.

రూ.లక్షల్లో లావాదేవీలు..

పట్టణంలో రోజూ రూ.లక్షల్లో మట్కా లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిర్వాహకుల కనుసన్నల్లో విపరీతంగా జరుగుతున్న మట్కా జూదంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు రోడ్డున పడకుండా ముందుగానే అధికారులు మేల్కోవాలని వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పొన్నూరు: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్రం అధికారి కె.ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్, పెట్రోల్ బంకులలో వాటిల్లే ముప్పును వివరించి రక్షణకు తీసుకునే చర్యలను సిబ్బంది చేసి చూపించారు. అగ్నిమాపక కేంద్రంలో ఉండే ప్రమాద నివారణ సామాగ్రి, వాటిని వినియోగించే పద్ధతులను వివరించి చెప్పారు. కార్యక్రమంలో పెట్రోల్ బంకు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, డెలివరీ బాయ్స్, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునర్విభజన దుష్ఫలితాలపై సమావేశం రేపు

గుంటూరు రూరల్: పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, దాని దుష్ఫలితాలపై ఈనెల 20వ తేదీన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు అమరావతి రోడ్డు నగరాలులోని బీవీఆర్ కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాజకీయ విశ్లేషకుడు, జైకిసాన్ ఆందోళన నాయకుడు, భారత్ జోడో అభియాన్ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ డివిజన్ అధ్యక్షుడి రాజీనామా

గుంటూరు రూరల్: ఏళ్ల తరబడి కష్టపడి పని చేస్తున్న తనకు ఎటువంటి పదవి దక్కలేదని 41వ డివిజన్ అధ్యక్షుడు టీడీపీ పార్టీకి రాజీనామా చేస్తున్నానని రాసిన లేఖ వాట్సప్ గ్రూప్‌లలో చక్కర్లు కొడుతుంది. వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న విషయం ప్రకారం.. ఇటీవల ప్రభుత్వం ఒక పదవిని ప్రత్తిపాడుకు కేటాయించగా అది కూడా 41డివిజన్‌లో పొత్తులలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. తెలుగుదేశం పార్టీ కోసం నియోజకవర్గంలో ఎంతో మంది నాయకులు గురు సమానులైన మాకినేని పెద్దరత్తయ్య సారథ్యంలో కలిసి పార్టీ కోసం ఆస్తులు అమ్ముకొని నిలబడి ఉన్నాం. అయినా మాకు అన్యాయం జరిగింది.. అంటూ 41డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సురేష్ అనే తాను రాజీనామా చేస్తున్నానని లేఖలో తెలిపారు.


నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీవో ఎ.ఉమాదేవి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వ సభ్య సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆమె కోరారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో మైనర్‌పై అత్యాచారం చేసిన నిందితు డిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబా న్ని పరామర్శించామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

భావన్నారాయణస్వామి రథం పనుల పరిశీలన



బాపట్ల: బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయానికి చెందిన నూతన రథం పనులను మాజీ శాసన సభ ఉప సభాపతి కోన రఘుపతి శుక్రవారం పరిశీలించారు. రథం పనులపై శిల్పి గణపతి ఆచారి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసమూర్తితో ఆయన చర్చించారు. ఈ సందర్భంలో శిల్పి గణపతాచారి పదే పదే ఇదంతా తమరి కృషి వల్లే జరిగిందని చెప్పారు. అనంతరం భావదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనతో పాటు బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షుడు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడిపై మూకుమ్మడి దాడి



దాడిలో గాయపడ్డ అంకమ్మరావు

గుంటూరు రూరల్: యువకుడిపై అగ్రవర్ణాలకు చెందిన రౌడీలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యలమంద గ్రామానికి చెందిన కొండపాటూరి అంకమ్మరావుకు గ్రామంలోని అగ్రవర్ణాలకు గతంలో వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో నరసరావుపేటలో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించి కోర్టు ద్వారా కేసు నమోదు చేసిన అంకమ్మరావు వాయిదాలకు తిరుగుతున్నారు. అంకమ్మరావు కుటుంబం రజక వర్గానికి చెందినవారు కావడంతో అగ్రవర్ణాల తాకిడికి తట్టుకోలేక తల్లి నాగేంద్రమ్మతో కలిసి మిర్చి యార్డు దగ్గర చిలకలూరిపేట రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న యలమంద గ్రామంలోని కొందరు నగరంలోని రౌడీషీటర్లతో కలిసి శుక్రవారం అంకమ్మరావుపై మూకుమ్మడి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారో చెప్పమంటూ ఆయుధాలతో బెదిరించారని బాధితుడు వాపోయాడు. స్థానికులు రౌడీషీటర్లను అడ్డుకోవడంతో అంకమ్మరావు తప్పించుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్లారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం పీడీఎం జిల్లా కన్వీనర్ బి.సుధాకర్ స్పందిస్తూ.. అంకమ్మరావు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం





గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపలకలూరు గ్రామం రైల్వే గేటు సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. దీంతో సంఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు చామనఛాయ కలిగి, బ్రౌన్‌కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నారని మృతుని ఆచూకి తెలిసినవారు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుంటూరు రూరల్: నగర శివారులోని వైజంక్షన్ నుంచి ఏటుకూరు వెళ్లే దారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు చామన ఛాయ రంగులో ఉన్నారని.. నలుపు రంగు, పొడవు చేతుల చొక్కా, లేత ఆకుపచ్చ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నారని అన్నారు. ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ వంశీధర్ తెలిపారు.

ఆర్‌పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ఆర్పీల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

లక్ష్మీపురం: ఆర్‌పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మెప్మా ఆర్పీల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మెప్మా ఆర్పీల సంఘం జిల్లా విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బలవంతపు కొనుగోళ్లు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియార్టీ, అర్హత ఉన్నవారికి సీఓగా ప్రమోట్ చేయాలని కోరారు. ఆర్పీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని చెప్పారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ చెప్పారనే పేరుతో సీఓలు, సీఎంఎంలు అవసరం లేని సరుకులను, అదనపు రేట్లతో కొనుగోలు చేయాలని వేధించడం మానుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పట్టణాల్లో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది వ్యాపారాలు చేయించడానికా లేక వ్యాపారం చేయించడానికా అని ప్రశ్నించారు. లాగిన్లు ఇవ్వకుండా ఆర్పీలతో ఎలా పని చేయిస్తారని పేర్కొన్నారు. కార్మిక, ఉద్యోగుల హక్కులను అందించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆర్పీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్పీ గుంటూరు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా అంకమ్మ, ఉపాధ్యక్షులుగా రమణ, బషీరా, సహాయ కార్యదర్శులుగా గుల్జార్, గౌస్య, గౌరవాధ్యక్షులుగా దండా లక్ష్మీనారాయణను ఎన్నికయ్యారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం



జ్ఞాపికను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నగరంపాలెం: కళలు, కళాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతి సమితి, భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీటీవి, కళాంజలి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహి స్తోన్న స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు శనివారం రెండో రోజుకి చేరాయి. సంప్రదాయ సభను ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ నాటక కళాకారులకు, పలు రంగాల్లోని కళాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. అనంతరం నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ దర్శకత్వం వహించిన కవిరాజు విజయం పద్యరూపక టెలిఫిలింను ప్రదర్శించారు. కవిరాజు విజయం కళాకారులకు, సాంకేతిక సిబ్బందికి జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దూరదర్శన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఏవీ కృష్ణమోహన్, పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ-2025 పరీక్షకు ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ ఆధ్వర్యంలో డీఎస్సీ-2025 సన్నద్ధతపై ఉచిత అవగాహన సదస్సు ఈనెల 24న నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ టీఎస్ రామన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 2/11లోని కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని సిలబస్, ప్రిపరేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): వేసవిలో ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నట్లు యోగా శిక్షకుడు షఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లాసులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ఉదయం 5-6 గంటల మధ్య సంతోషిమాతా దేవాలయ ప్రాంగణంలోనూ సాయంత్రం 4-30 నుంచి 5-30 మధ్యలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. మొత్తం 21 రోజులపాటు ఈ యోగా క్లాసులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94406 35746 సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మణిపురం ఓవర్‌బ్రిడ్జి సమీపంలో నివాసం ఉండే షేక్ ఫారూఖ్(38)కు ప్రగతినగర్‌లో ఓ ప్లాట్ ఉంది. ఆ ప్లాట్‌లో ఇంటి నిర్మాణం కోసం రాము అనే వ్యక్తికి రూ.లక్ష ఇచ్చాడు. సదరు రాము ఇంటి నిర్మాణాన్ని సరిగా చేపట్టకపోవడంతో పలుమార్లు అడిగినా ఫలితం లేకపోవడంతో ఈనెల 16వ తేదీ రాత్రి ఫారూఖ్ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

లక్ష్మీపురం: గోవుల మృతికి బాధ్యత వహిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ రాజీనామా చేయాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించాలని కోరారు.

గర్భిణికి అండగా లాలాపేట పోలీసులు



పట్నంబజారు: అర్ధరాత్రి సమయంలో గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో లాలాపేట పోలీసులు అండగా నిలిచారు. గురువారం రాత్రి కమ్మశేషయ్య గ్రౌండ్ ప్రాంతంలో పోలీసు స్టేషన్ ఏఎస్ఐ నరసింహారావు గస్తీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఒక వ్యక్తి ఇంట్లో గర్భిణి పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పాడు. ఎలాంటి రవాణా సదుపాయం లేదని, సాయం చేయాలని కోరాడు. స్పందించిన ఎస్ఐ నరసింహారావు, కానిస్టేబుల్ నాగరాజు పోలీసు రక్షక్ వాహనంలో గర్భిణిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శనివారం ప్రారంభించనున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

నేడు నగరంలో ర్యాలీ

నెహ్రూ నగర్: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ నుంచి శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం 10 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్, స్టాల్స్ ప్రదర్శన, ఈ-వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రెటరీ కె.విజయానంద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, జిల్లా కలెక్టర్ కె.నాగలక్ష్మి పాల్గొంటారన్నారు. నగర ప్రజలు కూడా తమ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రత్యేక స్టాల్స్‌ల్లో అందించి తగిన రశీదు పొందాలని కోరారు.

క్రీస్తు మందిరాల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



శిలువ మార్గం కార్యక్రమం



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

పెదకాకాని: లోకరక్షకుడైన క్రీస్తు మానవులను పాపముల నుంచి రక్షించడానికి శిలువను ఎక్కారని రెవరెండ్ ఫాదర్ పూదోట నవీన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నంబూరు ఆర్‌సీఎం ప్రార్థనా మందిరంలోని వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ నవీన్ మాట్లాడుతూ.. శాంతియుత సమాజం కోసం సన్మార్గ జీవనాన్ని మానవాళికి తెలియజేసేందుకు కీస్తు శిలువనెక్కి తన రక్తాన్ని చిందించిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకొంటున్నామన్నారు. నంబూరు యేసు తిరుహృదయ దేవాలయం ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిలువ మార్గంలో ప్రభువు 14 స్థలాల్లో చెప్పిన మాటలు దృశ్య రూపంలో ప్రదర్శించడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సుమారు 1000 మందికి పైగా విశ్వాసులు హాజరయ్యారు. ఫాదర్ కోడూరు వినోద్ కుమార్ ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. శిలువ ఆరాధన, సాంగ్యం అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. నంబూరు కోటేశ్వరరావు, ప్రాతూరు వినాయక, నంబూరు రాంబాబు, కోడూరు కనకరాజు, వల్లభాపురం హృదయ రాజు, నంబూరు జాజ్, నంబూరు మత్తయ్య కార్యక్రమాలకి సహకరించిన విశ్వాసులకు, గ్రామ ప్రజలకు ఆర్‌సీఎం చర్చి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వంలో మసకబారుతున్న విద్యావ్యవస్థ

పెదకాకాని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు విఘాతం కలిగిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన విద్యాభివృద్ధిపై దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజురోజుకూ ప్రభుత్వ విద్యావ్యవస్థ మసకబారుతోందన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి తొలి ఏడాది ఎగ్గొట్టారన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని షేక్ నజీర్ డిమాండ్ చేశారు.

ఫార్మసీ నిపుణులకు విస్తృత ఉపాధి అవకాశాలు

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమామార్ యాదవ్

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలోని ఫార్మసీ నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం రాత్రి కళాశాల సిల్వర్‌జూబ్లీతో పాటు వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో తయారవుతున్న వివిధ జనరిక్ ఔషధాలు, వ్యాక్సిన్లు, మెడికల్ డివైజెస్ ప్రపంచంలోని పలు దేశాలకు ఎగుమతి చేస్తున్నామని, భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, జన ఔషధి కేంద్రాలు, వికసిత్ భారత్ వంటి ప్రతిపాదనలతో ప్రజలకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని వివరించారు. ఈసందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఎం జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించారు. కళాశాల యాజమాన్యం ప్రతిపాదించిన ఫార్మసీ యూనివర్సిటీ, హోమియో కళాశాల స్థాపనకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల కమిటీ చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ 1999లో బీ ఫార్మసీ కోర్సుతో ప్రారంభించిన కళాశాలలో డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులతో విస్తరించి, పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల అభివృద్ధికి పాటుపడిన కమిటీ సభ్యులు మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి, సీహెచ్ సూర్యనారాయణమూర్తి, గొడవర్తి సత్యనారాయణ సేవలను కొనియాడారు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మధుకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సివిల్స్‌లో శిక్షణ అభినందనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభగల పేద విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్స్, తదితర ప్రవేశ పరీక్షలకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలను సందర్శించిన మంత్రి సత్యకుమార్, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ముద్రించిన కరెంట్ జియోగ్రఫీ (2024-25) పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు స్టడీ సర్కిల్ వ్యవస్థాపకుడు డాక్టర్ లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ భౌగోళిక సమాచారాన్ని సరళమైన భాషలో రూపొందించడంతో పాటు సివిల్స్‌కు శిక్షణ కల్పించి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. అత్యంత వెనుకబడిన ధర్మవరం నియోజకవర్గంలోని యువతీ, యువకులను మూడు రకాలుగా ఫిల్టర్ చేసి, అత్యంత ప్రతిభ కనబర్చిన 28 మందికి హైదరాబాద్‌లో రెండేళ్లపాటు ఉచితంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ కల్పించేందుకు ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. సివిల్స్‌లో 6వ ర్యాంకుతో 23 ఏళ్ల పిన్న వయసులో సివిల్స్‌కు ఎంపికైన దినేష్ కుమార్, ఆయుష్ శాఖకు రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ సిరిపురపు మధుసూదనరావు, ఏసీబీ ఎస్పీ సుధాకర్, ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పదో వారం 'మీ కోసం మేము'



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన నాగరాజకుమారి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పదో వారం మీకోసం మేము పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేషెంట్‌లకు ఆస్పత్రి నియమావళి గురించి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ వివరించారు. రోగులు, వారి బంధువులకి జీవనశైలి మార్పులు, వాటి వలన కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. సరైన శారీరక శ్రమ లేకపోవడం వలన వస్తున్న సమస్యలు మోకీలు, ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్య వస్తే అందుబాటులో ఉన్న చికిత్స వివరాలు తెలిపారు. జీజీహెచ్‌లో నేషనల్ వ్యయామ దినోత్సవం సందర్భంగా .. మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు రాబో రెండు నెలల్లో ప్రారంభించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ఎవరికీ డబ్బు చెల్లించవద్దని, ఒకవేళ ఎవరైనా డబ్బు అడిగితే రసీదు అడగమని ఇవ్వని పక్షాన సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమానికి ప్రముఖ స్వచ్ఛంద సేవా కార్యకర్త నాగరాజ కుమారి హాజరై వారి సంస్థ తరపున పేషెంట్‌కి బియ్యం పంపిణీ చేశారు.